AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
19-5-2026 (Tuesday)
MAIN EDITION

## బండి భగీరథ్ కేసులో మరో సిట్ ఏర్పాటు



**అక్షరటుడే, హైదరాబాద్:** బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బెయిల్ పిటిషన్ విచారణ సమయంలో న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసిన వారి గురించి దర్యాప్తు చేసేందుకు జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో అధికారులు సిట్ ఏర్పాటు చేశారు.

## వీధి కుక్కల విషయంలో సుప్రీం కీలక తీర్పు..



**అక్షరటుడే, ఢిల్లీ:** వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కుక్కల విషయంలో ప్రభుత్వాల తీరును ఆక్షేపించింది. వీధుల్లో కుక్కలు కనపడ్డానికి వీల్లేదని.. ప్రమాదకర కుక్కలను సహించవద్దని పేర్కొంది. వీధికుక్కల విషయంలో ప్రభుత్వాలు ప్రేక్షకపాత్ర పోషించకూడదని.. అధికారులు కోర్టు ధిక్కరణ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది. వీధి కుక్కల తరలింపుపై గతంలో ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకునేందుకు న్యాయస్థానం నిరాకరించింది.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు ధిక్కార నోటీసులు



**అక్షరటుడే, ఢిల్లీ:** జస్టిస్ స్వరనా కాంత శర్మపై 'దూషణాత్మక' పోస్ట్ చేసినందుకు కేజ్రీవాల్‌కు ఢిల్లీ హై కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, ఇతర ఆప్ నాయకులకు నోటీసులిచ్చింది. నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని గడువు ఇచ్చింది. తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

## రష్యా ఆయిల్ కొనుగోలుకు అమెరికా గ్రీన్ సిగ్నల్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇంధన మార్కెట్ స్థిరత్వానికి అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 17 వరకు రష్యా క్రూడాయిల్ కొనుగోలుకు ప్రపంచ దేశాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అప్పటివరకు గతంలో విధించిన ఆంక్షలకు మినహాయింపు ఉంటుందని యూఎస్ ఫైనాన్స్ మినిస్టర్ స్కాట్ తెలిపారు.

## ఫాల్టాలో టీఎంసీకి ఎదురుదెబ్బ



**అక్షరటుడే,నేషనల్ డెస్క్:** పశ్చిమబెంగాల్‌లోని ఫాల్టాలో టీఎంసీకి ఎదురుదెబ్బ తగిలింది. మే 21న జరనున్న రీపోలింగ్‌కు రెండు రోజుల ముందు ఆ పార్టీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ ఎన్నికల పోటీ నుంచి వైదొలిగారు. అభిషేక్ బెనర్జీకి సన్నిహితుడైన జహంగీర్ ఖాన్.. ఇకపై తాను ఎన్నికల్లోనూ పోటీ చేయనని చెప్పారు.



## విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు..

**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని వ్యాఖ్యానించారు. పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీఎంకే నేతలకు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితి పెంపు

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వయో పరిమితిని పదేళ్లు పెంచింది. ఏడాది పాటు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు జీవో జారీ చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. సాధారణ ఉద్యోగాల కోసం గరిష్ట వయోపరిమితి 34 ఏళ్లు. తాజాగా ప్రభుత్వం 10 ఏళ్లు పెంచడంతో ఇది 44 ఏళ్లకు పెరిగింది. నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున వినతులు రావడంతో వయో పరిమితి పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఓ అధికారి ఏకంగా రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టాడు. లంచాలు తీసుకొని భారీగా బంగారం, ఆస్తులు కొనుగోలు చేశాడు. అతడిపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో అతడి అక్రమాస్తులు చూసి అధికారులే షాక్ అయ్యారు. ఇంట్లో భారీగా నోట్ల కట్టలు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.**

- అక్షరటుడే, హైదరాబాద్



# రూ.100 కోట్ల అక్రమాస్తులు!

- జలమండలి జీఎం ఇంట్లో ఏసీబీ సోదాలు
- భారీగా అక్రమాస్తుల గుర్తింపు
- కిలో బంగారం, రూ.1.10 కోట్ల నగదు స్వాధీనం

హైదరాబాద్‌లోని జలమండలి లో పని చేస్తున్న జనరల్ మేనేజర్ కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. కుమార్ రెడ్‌హిల్స్ డివిజన్ జీఎంగా కుమార్ పని చేస్తున్నారు. ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదైంది. ఈ మేరకు ఏసీబీ అధికారులు సికింద్రాబాద్‌లోని మల్లాపూర్‌లో ఉన్న కుమార్ నివాసంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో అతడికి రూ.100 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. కుమార్ నివాసంతో పాటు ఆయన బంధువుల ఇంట్లో సైతం సోదాలు చేపట్టారు.

### ఖరీదైన ప్లాట్లు

సోదాల సమయంలో జీఎం కుమార్ ఇంట్లో రూ.1.10 కోట్ల నగదు, సుమారు కిలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అతడికి హైదరాబాద్ గేటెడ్ కమ్యూనిటీలో 3 ఫ్లాట్లు, 6 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. నిజామాబాద్ లో 3 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ఇంకా పలు బ్యాంక్‌ల్లో లాకర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిని ఓపెన్ చేయనున్నారు. బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### మారని తీరు

అవినీతి అధికారుల తీరు మారడం లేదు. ఇటీవల ఏసీబీ దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. అవినీతి అధికారులే లక్ష్యంగా ఏసీబీ దూకుడు ప్రదర్శిస్తోంది. అయినా లంచాలకు మరిగిన అధికారులు మారడం లేదు. ప్రజలు, కాంట్రాక్టర్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. జలమండలిలో పలువురు అవినీతి అధికారులు తిష్ట వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ల నుంచి వీరు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణను చూసే జలమండలిలో అవినీతితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## వరంగల్ కాంగ్రెస్‌లో ఒక్కటైన నేతలు



**అక్షరటుడే, వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొంతకాలంగా వర్గపోరుతో విమర్శలు చేసుకుంటున్న నాయకులు ఒక్కటయ్యారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. క్షేత్రస్థాయి నాయకుల నుంచి సీనియర్ నాయకత్వం వరకు అందరూ హాజరయ్యారు. జిల్లాలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం, ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కోవడం ఎలా అనే అంశాలపై చర్చించారు. సమావేశంలో మంత్రి సురేఖతో పాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## బాంద్రాలో భారీగా కూల్చివేతలు



**అక్షరటుడే, ముంబై:** ముంబైలోని బాంద్రా ఈస్ట్‌లో అధికారులు భారీగా కూల్చివేతలు చేపట్టారు. పశ్చిమ రైల్వే, ఇతర అధికారులు మంగళవారం కూల్చివేతలు ప్రారంభించారు. బాంద్రా ఈస్ట్‌లో చాలా మంది అక్రమంగా నివసిస్తున్నారు. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. చట్టబద్ధంగా నివసిస్తున్న 100 మంది నివాసితులు మినహా, మిగిలిన వారందరి నిర్మాణాలు కూల్చివేయనున్నారు. కాగా.. కూల్చివేతల అనంతరం ఆ స్థలాన్ని ముంబై నుంచి వచ్చే 50 కొత్త రైళ్లకు సౌకర్యం కల్పించడానికి, బాంద్రా టెర్మినల్ విస్తరణకు ఉపయోగించనున్నారు. బాంద్రా సబర్బన్ స్టేషన్‌ను బాంద్రా టెర్మినస్‌కు అనుసంధానించడానికి, సబర్బన్ రైళ్లను వేరు చేయడానికి అదనపు స్థలాన్ని ఉపయోగించుకుంటారు.

## మేడ్చల్ కెమికల్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

**అక్షరటుడే, మేడ్చల్:** మేడ్చల్‌లోని ఓ కెమికల్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్గ్ కెమ్ కెమికల్ కంపెనీలో ప్రమాదం జరగ్గా.. భారీగా ఆస్తి నష్టం జరిగింది. మంటలు, దట్టమైన పొగలు ఎగిసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.



## కారులో మహిళా లాయర్‌పై అత్యాచారం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పూణేలో ఒక మహిళా న్యాయవాదిపై కదులుతున్న కారులో సామూహిక అత్యాచారం జరిగిన ఘోర ఘటన దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. పాట్నాకు చెందిన బాధితురాలు పూణేలో ఎల్ఎల్‌బీ చదివి, ప్రస్తుతం ముంబై హైకోర్టులో లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. పూణేలో ఉన్న బాధితురాలు, మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తిని కలవడానికి కోరేగావ్ పార్క్‌లోని ఒక ఫైవ్ స్టార్ హోటల్‌కు వెళ్లారు. సాయంత్రం వేళ ఆ వ్యక్తి తనతో పాటు మరో ఇద్దరు మహిళలను తీసుకుని అక్కడకు వచ్చాడు. కాసేపు మాట్లాడుకున్న తర్వాత ఆ ముగ్గురూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత అదే హోటల్‌లో ఆమె మద్యం సేవిస్తున్న సమయంలో, పక్క టేబుల్‌లో కూర్చున్న ఇద్దరు వ్యక్తులతో ఆమెకు మాటలు కలిశాయి. అనంతరం వారంతా కలిసి ఒక పబ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి కారులో బయలుదేరిన కొద్దిసేపటికే నిందితుల అసలు స్వరూపం బయటపడింది. ప్రయాణంలో ఉండగానే నిందితుల్లో ఒకడు కదులుతున్న కారులోనే ఆమెపై లైంగిక దాడికి ఒడిగట్టాడు.

## ప్రపంచాన్ని వణికిస్తున్న ఎబోలా కొత్త స్ట్రెయిన్..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** ఆఫ్రికా దేశమైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకూ కేసులు, మరణాల సంఖ్య పెరుగుతుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) దీనిని అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ వ్యాప్తి పొరుగు దేశాలకు కూడా విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అమెరికా వ్యాధి నిరోధక సంస్థ నివేదిక ప్రకారం.. కాంగోలో ప్రస్తుతం 11 నిర్ధారిత కేసులు, 336 అనుమానిత కేసులు ఉండగా, ఇప్పటివరకు 88 మంది మరణించారు. అయితే, అంతర్జాతీయ మీడియా సంస్థల కథనాల ప్రకారం మరణాల సంఖ్య ఇప్పటికే 118 దాటినట్లు తెలుస్తోంది. ఈసారి వ్యాప్తికి 'బండిబుగ్యో' అనే అరుదైన ఎబోలా జాతి కారణమని వైద్యులు గుర్తించారు.

## చీరకట్టులో ఆకట్టుకున్న మానస..



**అందానికి అందం.. అందుకు తగ్గట్టు అభినయం ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్న నటి మానస వారణాసి. తాజాగా ఈ బ్యూటీ మరో ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి అందరినీ కట్టిపడేసింది. చీరకట్టులో వింటేజ్ రొమాంటిక్ లుక్‌తో అభిమానులను మెస్మరైజ్ చేసింది. మొత్తానికైతే మానస వారణాసి షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. అచ్చం మన ఇంటి అమ్మాయిల ఉంది అంటూ పలువురు నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.**

- అక్షరటుడే, సినిమాడెస్క్